సాక్షి
సిద్దిపేట
శుక్రవారం । 31 । జనవరి । 2025

రెండో రోజూ పోటెత్తిన భక్తజనం



కూడవెల్లి జాతరలో భక్తుల సందడి

దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన కూడవెల్లి రామలింగేశ్వరస్వామి జాతరకు రెండో రోజైన గురువారం భక్తులు పోటెత్తారు. మొదటి రోజు, రెండో రోజు లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయవర్గాలు తెలిపాయి. శుక్రవారం చివరిరోజు సైతం భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. జిల్లా సివిల్‌కోర్టు జడ్జి సాయిరమా దేవితో పాటు పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

– దుబ్బాక



ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో భక్తజనం

పుల్లూరు బండ.. ఆధ్యాత్మిక కొండ

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి జాతర

పుల్లూరు బండ.. భక్తజనసంద్రమైంది. స్వయంభూ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం భక్తులతో కిక్కిరిసి పోయింది. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను కనులపండువగా ఊరేగించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు, ఆలయ కమిటీ పటిష్ట చర్యలు చేపట్టింది. – సిద్దిపేటరూరల్



భక్తుల పుణ్యస్నానాలు

న్యూస్‌రీల్

నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే చర్యలు

- మున్సిపల్ కమిషనర్ నర్సయ్య



గజ్వేల్‌లో నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ నర్సయ్య

గజ్వేల్: నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య హెచ్చరించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలో పలు నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిర్మాణాలకు అనుమతి పొందిన యజమానులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని సూచించారు. లేనిపక్షంలో 2019 చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవ తప్పిదాలవల్లే రోడ్డు ప్రమాదాలు

- ఎంవీఐ శంకర్ నారాయణ



అవగాహన కల్పిస్తున్న శంకర్ నారాయణ

సిద్దిపేటజోన్: మానవ తప్పిదాల వల్లే అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నారాయణ అన్నారు. ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరికి రోడ్డు నిబంధనలపై అవగాహన ఉండాలని అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక క్రాంతి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత అందరి బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.18 ఏళ్లు నిండిన వారు తప్పనిసరిగా వాహన డ్రైవింగ్ లైసెన్సు పొందాలని, హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని నివారిద్దాం



చిన్నకోడూరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్య సిబ్బంది, గ్రామస్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): కుష్టు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని వైద్యురాలు ఐశ్వర్య అన్నారు. గురువారం చిన్నకోడూరులో కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జ్వరంతో పాటు శరీరంపై మచ్చలు వాచి ఎర్రగా మారి నొప్పిగా ఉన్నట్లు అనిపిస్తే కుష్టు వ్యాధిగా గుర్తించాలన్నారు. కళ్లు ఎర్రబడి నొప్పిగా ఉండటం, నీళ్లు కారడం, చూపు మందగించినప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. కుష్టు వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కార్యాలయాలకు కసరత్తు

జిల్లాలో నూతనంగా ఏర్పడిన మూడు మండల పరిషత్ కార్యాలయాల ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలో దూల్మిట్ట, అక్బర్‌పేట-భూంపల్లి, కుకునూరుపల్లి మండలాలు గతంలోనే ఏర్పాటైన విషయం విదితమే. మండల పరిషత్‌లను ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసింది. దూల్మిట్ట మండల పరిధిలో 11గ్రామాలు. కుకునూరుపల్లి మండలం పరిధిలో 15 , అక్బర్‌పేట-భూంపల్లిలో 19 గ్రామ పంచాయతీలున్నాయి. ప్రస్తుతం 23 ఎంపీడీఓ కార్యాలయాలుండగా కొత్తవాటితో కలిపి 26 కానున్నాయి.



అక్బర్‌పేట-భూంపల్లిలో కార్యాలయం కోసం పరిశీలిస్తున్న అధికారులు

కొత్త మండల పరిషత్‌ల ఏర్పాటుకు సన్నాహాలు

- దూల్మిట్ట, అక్బర్‌పేట-భూంపల్లి, కుకునూరుపల్లికి ఇన్‌చార్జి ఎంపీడీఓలు
- 26కు పెరగనున్న ఎంపీడీఓ ఆఫీసులు

సాక్షి, సిద్దిపేట: మూడు మండల కేంద్రాల్లో మండల పరిషత్ కార్యాలయాల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మండల కేంద్రాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించారు. ఏవి అనుకూలమో ఆరా తీశారు. దూల్మిట్ట మండల పరిషత్ కార్యాలయాన్ని గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసేందుకు గ్రామ సభను ఏర్పాటు చేశారు. ప్రజలు మాత్రం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేయవద్దంటూ పట్టుపట్టారు. 'అవసరమైతే చందాలు వేసుకుని ప్రైవేట్ భవనం అద్దె చెల్లిస్తాం. కానీ పంచాయతీ కార్యాలయంలో వద్ద'ని గ్రామ సభలో ప్రజలు స్పష్టం చేశారు. అక్బర్‌పేట- భూంపల్లిలోని ఆరోగ్య ఉపకేంద్రంలో ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా గుర్తించారు. కుకునూరుపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. కార్యాలయాలు ఎక్కడ ఏర్పాటు అవుతాయనే విషయం ఇంకా నిర్ధారించలేదు. ఉమ్మడి మండల పరిషత్ కార్యాలయం నుంచే ఫర్నిచర్ సర్దుబాటు చేయనున్నారు. ఫిబ్రవరి మొదటి వారం నుంచి నేరుగా కార్యకలాపాలు కొనసాగించే అవకాశాలున్నాయి.

ఇన్‌చార్జి ఎంపీడీఓల నియామకం

మూడు మండల పరిషత్‌లకు ఇన్‌చార్జి ఎంపీడీఓలను కలెక్టర్ నియమించారు. దూల్మిట్టకు నంగనూరు ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ ప్రభాకర్ రావును, అక్బర్‌పేట-భూంపల్లికి దౌల్తాబాద్ ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ ఎం జయపాల్ రెడ్డి, కుకునూరుపల్లికి కొండపాక ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ రాంప్రసాద్‌ను ఇన్‌చార్జి ఎంపీడీఓలుగా నియమిస్తూ కలెక్టర్ మనుచౌదరి ఉత్తర్వులను జారీ చేశారు.. అలాగే కార్యాలయ సిబ్బంది సైతం నియమించనున్నారు. ఇదిలా ఉంటే.. ఎన్నిక కోడ్ నేపథ్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉండకపోవచ్చని, నేరుగా కార్యకలాపాలు కొనసాగించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

వసంత పంచమికి పటిష్ట బందోబస్తు

వర్గల్(గజ్వేల్): వసంత పంచమి మహోత్సవం సందర్భంగా వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఏసీపీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. గురువారం ఆయన వర్గల్ క్షేత్రాన్ని సందర్శించారు. ఫిబ్రవరి 3న జరిగే మహోత్సవానికి ఏర్పాట్లను రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి, ఆలయ మేనేజర్ రఘుపవన్‌తో సమీక్షించారు. ప్రత్యేక దర్శనం, సాధారణ దర్శనం, పార్కింగ్ ప్రదేశాలు, సామూహిక అక్షరాభ్యాస మండపాలను, ప్రధాన ఆలయంతోపాటు, ఇతర ఆలయాలను పరిశీలించారు. భక్తుల రద్దీ దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే భక్తజనాదరణ కలిగిన వర్గల్ క్షేత్రానికి వసంత పంచమి సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



క్షేత్రం వద్ద ఏర్పాట్లను సమీక్షిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాల్సిందే



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా, ఎమ్మెల్సీ అలుగుబెల్లి, నాయకులు

- సాధించే వరకు పోరాటం
- మహా ధర్నాలో ఎమ్మెల్యే పల్లా, ఎమ్మెల్సీ అలుగుబెల్లి

చేర్యాల(సిద్దిపేట): అన్ని అర్హతలున్న చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసేవరకు పోరాడుతామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి స్పష్టం చేశారు. గురువారం స్థానికంగా అఖిల పక్ష జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. స్థానిక గాంధీ సెంటర్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద అఖిలపక్ష జేఏసీ చైర్మన్ వకుళాభరణం నర్సయ్యపంతులు అధ్యక్షతన ఏర్పాటుచేసిన శిబిరంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలు ప్రాంతాలను రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటు చేశారని, కానీ చేర్యాలను మరిచారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల వేళ సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా మాట ఇచ్చి విస్మరించడం తగదన్నారు. రెవెన్యూ డివిజన్ చేస్తే ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు.ధర్నాలో అఖిల పక్ష నాయకులు మల్లారెడ్డి, కనకారెడ్డి, కేవీఎల్ఎన్ రెడ్డి, సురేష్, రాజు, బాల్‌నర్సయ్య, కరుణాకర్, రాజేందర్, శ్రీధర్, మల్లేశం, చందు, పర్వతాలు, అంజయ్య, ఎల్లారెడ్డి, మానస, రంజిత, పద్మ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల వినూత్న నిరసన

కాంగ్రెస్ పాలకుల్లో మార్పు రావాలంటూ గాంధీ విగ్రహానికి వినతులు

సిద్దిపేటజోన్: ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేలా కాంగ్రెస్ పాలకుల్లో మార్పు కలిగించాలంటూ బీఆర్ఎస్ నేతలు వినూత్న నిరసన చేపట్టారు. గురువారం జిల్లా కేంద్రంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రాలు అందించారు. హామీలన్నీ వంద రోజుల్లో అమలు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందంటూ బీఆర్ఎస్ నేతలు పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఆందోళన చేపట్టారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజనర్స్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేయాలని లేనిపక్షంలో ఉధృతంగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలోమున్సిపల్ వైస్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ నూతన కమిషనర్‌గా మట్ట శ్రీనివాస్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ధర్మపురి మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. దుబ్బాక కమిషనర్‌గా పనిచేసిన రమేశ్‌కుమార్ కామారెడ్డికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజలు సహకారంతో మున్సిపల్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.



బాధ్యతలు చేపడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



గజ్వేల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారిద్దామని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి, గజ్వేల్ సీఐ సైదాలు పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఇందిరాపార్కు చౌరస్తా వరకు విద్యార్థులతో కలిసి వారు భారీ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు ప్రమాదం కుటుంబాన్ని ఆర్థికంగా, మానసికంగా కృంగదీస్తుందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. మైనర్లు వాహనాలను నడపకూడదన్నారు. కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌ని బర్తరఫ్ చేయండి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

దుబ్బాకటౌన్: ప్రజాయుద్ధ నౌక గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌ను కేంద్ర మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. గద్దర్ జయంతి ఉత్సవాల గోడ పత్రికను గురువారం రాయపోల్ మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గద్దర్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించారు. ఎంత మంది బీజేపీ కార్యకర్తలను గద్దర్ చంపారో లెక్కచెప్పాలన్నారు. శుక్రవారం నగరంలో జరిగే గద్దర్ జయంతి సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, విష్ణు, ప్రకాశ్, రాజు, కనకయ్య, రాజయ్య, అంజగౌడ్, తదితరులున్నారు.

కేంద్ర మంత్రి దిష్టిబొమ్మ దహనం

సిద్దిపేటరూరల్: కేంద్ర మంత్రి చేసిన అసంబద్ధ వ్యాఖ్యలకు నిరసనగా గురువారం నారాయణరావుపేట మండల కేంద్రంలో మాలమహానాడు ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి గద్దర్ విశేష కృషి చేశారని, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన గొప్పవ్యక్తి అన్నారు. వెంటనే బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాలమహానాడు నాయకులు

ముంచెత్తుతున్న మురుగు

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని మురుగురహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిర్మించిన యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనుల్లో నాణ్యతాలోపం శాపంగా మారింది. పలు కాలనీల్లో పైప్‌లైన్లు, చాంబర్ల ధ్వంసమవడం, లీకేజీల కారణంగా జనావాసాల్లో మురుగు నీరు పారుతోంది. ఫలితంగా దుర్గంధం వ్యాపిస్తోంది. రూ.155 కోట్లు వెచ్చించి యూజీడీ నిర్మించిన కొన్నాళ్లకే అధ్వానంగా మారడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

యూజీడీ.. లీకేజీ

- రూ.155కోట్లు వెచ్చించినా వీడని కంపు
- నాణ్యతాప్రమాణాలకు మంగళం
- పలు కాలనీల్లో పైప్‌లైన్ల ధ్వంసం
- పనుల తీరుపై ఆది నుంచి విమర్శలే

గజ్వేల్: మున్సిపాలిటీ పరిధిలోని గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లలో 2020 జూన్ నెలలో 138 కిలోమీటర్ల మేర భూగర్భ మురుగునీటి పైప్‌లైన్ వ్యవస్థతో పాటు నాలుగు చోట్ల ఎస్‌టీపీ (సేవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ల నిర్మాణం చేపట్టారు. మొదట్లో విడుదలైన రూ.99కోట్లతో పనులతో పూర్తి కాక అంచనాలు అమాంతంగా పెంచారు. నిజానికి ముందున్న ప్రతిపాదనల్లో 138కిలోమీటర్ల పైప్‌లైన్ విస్తరణ పనులు చేపట్టాల్సి ఉండగా.. కేవలం 99కిలోమీటర్ల పైప్‌లైన్ విస్తరణకే నిధులు సరిపోయాయని, పట్టణంలో ఇంకా పనులు చేపట్టాల్సిన కాలనీలు ఉన్నాయని, వీటిల్లో అంతర్గత పైప్‌లైన్లను నిర్మించాల్సి ఉన్నదని చెబుతూ అంచనా వ్యయం పెంచి అదనంగా రూ.56కోట్ల నిధులు తెప్పించారు. మొత్తం వ్యయం రూ.155కోట్లకు చేరింది. ఈ నిధులతో 99కిలోమీటర్ల నుంచి 130కిలోమీటర్లకుపైగా పైప్‌లైన్ పనులు పూర్తి చేశామని అధికారులు చెబుతున్నారు.

పనులు లోపభూయిష్టం..

యూజీడీ పనులు లోపభూయిష్టంగా సాగటం వల్ల పలు కాలనీల్లో నిర్మించిన పైప్‌లైన్లకు లీకేజీలు ఏర్పడ్డాయి. మరోవైపు కొన్ని చోట్ల చాంబర్ల ధ్వంసమయ్యాయి. ఫలితంగా జనావాసాల్లోకి మురుగునీరు పారుతోంది. ప్రధానంగా పట్టణంలోని వైష్ణవీ గార్డెన్స్ సమీపంలోని లక్ష్మీప్రసన్ననగర్ కాలనీలో ఈ పరిస్థితి నెలకొన్నది. నెలల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇక్కడే కాదు.. పట్టణంలోని పలు కాలనీల్లో ఈ పరిస్థితి కనిపిస్తున్నది. పట్టణంలో మూడున్నరేళ్లకుపైగా సాగిన ఈ పనుల్లో అడుగడుగునా నాణ్యతా ప్రమాణాలు లోపించడమే ఈ దుస్థితికి కారణం. పనులను పర్యవేక్షించాల్సిన అధికార యంత్రాంగం పట్టింపులేనితనం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం అన్నీ కలిసి యూజీడీ పనులు ఇష్టారాజ్యంగా సాగటానికి కారణమయ్యాయి. ఇకపోతే ఎక్కడైనా యూజీడీ చాంబర్ల నిండితే..వాటిని క్లియర్ చేయాల్సిన జెట్టింగ్ యంత్రాలు అందుబాటులో ఉండాల్సి ఉండగా, ఇప్పటివరకు ఈ యంత్రాల జాడే లేదు. దీనివల్ల చాంబర్లను సకాలంలో క్లియర్ చేయక దుర్గంధం వ్యాపిస్తోంది.



లీకేజీతో మడుగును తలపిస్తున్న మురుగు



పట్టణంలోని లక్ష్మీప్రసన్ననగర్ కాలనీలో యూజీడీ లీకేజీలు

మరమ్మతులు చేయిస్తాం

యూజీడీ లీకేజీలు, పైప్‌లైన్ల ధ్వంసంపై దృష్టి పెడతాం. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. పట్టణాన్ని మురుగు రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకుసాగుతాం.

– గోల్కొండ నర్సయ్య, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన సదస్సు



కాలేజీ ఆవరణలో మొక్క నాటిన అమెరికాకు చెందిన ప్రొఫెసర్, తదితరులు

నర్సాపూర్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ ఉపయోగం అంశంపై స్థానిక బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం సదస్సు నిర్వహించారు. అమెరికాకు చెందిన బింగ్‌హామ్టన్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్ ప్రొఫెసర్ సాంగ్‌వోన్ యూన్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు, అధ్యాపకులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అత్యంత ముఖ్యమైన ప్రయోజనాలు, మెరుగైన నాణ్యత నియంత్రణ, కంప్యూటర్ విజన్ సిస్టమ్‌ల ఉత్పత్తుల్లోని లోపాలను తొలి దశలోనే గుర్తించడం తదితర విషయాలపై వివరించారు. సదస్సులో విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, ఇండ్రస్ట్రియల్ రిలేషన్ డైరెక్టర్ సతీష్‌చంద్ర, మేనేజర్ బాపిరాజు, ఉన్నత విద్యా కౌన్సిల్ కో ఆర్డినేటర్ ప్రణీత, ఆయా శాఖల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు. సదస్సు అనంతరం అమెరికాకు చెందిన ప్రొఫెసర్ స్థానిక కాలేజీ ప్రతినిధులతో కలిసి మొక్క నాటారు.

దాడి ఘటనలో వ్యక్తిపై కేసు

కౌడిపల్లి(నర్సాపూర్): చిన్నపాటి గొడవ కత్తితో దాడి చేసుకునే వరకు వచ్చింది. ఈ ఘటన మండలంలోని వెల్మకన్నలో చోటు చేసుకుంది. గురువారం ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వెల్మకన్న గ్రామానికి చెందిన కటికె సలీం, కటికె ఖాజా పాలివారు. పశువుల అమ్మకం, కొనుగోలు దళారి వ్యాపారంతోపాటు కులవృత్తి చేస్తారు. బుధవారం ఇద్దరి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. దీనికితోడు పాతకక్షలు ఉండటంతో గొడవ పెద్దదై కొట్టుకున్నారు. ఇంతలో కటికె సలీం కత్తితో దాడి చేయగా ఖాజాకు కాలు, వీపు భాగంలో గాయాలు అయ్యాయి. బాధితుడి కుమారుడు అజ్మత్ ఫిర్యాదు మేరకు సలీంపై కేసునమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యోగుల సేవలతోనే..

ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం

జెడ్పీ సీఈఓ ఎల్లయ్య



ఏసురత్నంను సన్మానిస్తున్న ఉద్యోగులు

మెదక్ కలెక్టరేట్: ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తే ప్రజల్లో ప్రభుత్వం పట్ల విశ్వాసం పెరుగుతుందని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య పేర్కొన్నారు. మెదక్ జెడ్పీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేసే యేసురత్నం స్పౌస్ బదిలీల్లో సంగారెడ్డికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఏసురత్నంను గురువారం మెదక్ జెడ్పీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అనంతరం జెడ్పీసీఈఓ మాట్లాడుతూ.. ఉద్యోగులు వారి విధులను సక్రమంగా నిర్వహిస్తే ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర బాధ్యులు రాజేందర్ రెడ్డి, రామకృష్ణ, శంకరంపేట ప్రధాన కార్యదర్శి నరేశ్ కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు రమేశ్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలతో రాంరెడ్డి

కొండపాక(గజ్వేల్): కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కొండపాక మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద రాజీవ్ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నంగునూరు మండలంలోని తిమ్మాయిపల్లికి చెందిన వ్యక్తి రాంరెడ్డి ద్విచక్ర వాహనంపై సిద్దిపేటకు వెళ్తున్నాడు. వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద సిద్దిపేట వైపునకు టర్న్ అవుతుండగా సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాంరెడ్డికి తీవ్ర గాయాలు కాగా టోల్ ప్లాజా అంబులెన్సు సిబ్బంది శ్రీనివాస్, రాకేశ్ సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

లగ్గానికి మంచి రోజులు

- జూన్ 7 వరకు శుభ ముహూర్తాలు
- 4 నెలల 15 రోజులు సందడే సందడి
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 1.50 లక్షలకు పైగా జరగనున్న వివాహాలు
- ఫంక్షన్ హాల్స్, టెంట్ హౌస్‌లు, పంతుళ్లు, బ్యాండ్ మేళాలకు డిమాండ్

నేటి నుంచి మోగనున్న పెళ్లి బాజాలు



దుబ్బాక: సరిగ్గా 36 రోజుల విరామం తర్వాత మళ్లీ పెళ్లి బాజాలు మోగనున్నాయి. మాఘమాసం శుభ కార్యాలకు శ్రేష్టం కావడంతో నేటి నుంచి జూన్ 7 వరకు జోరుగా వివాహాలు జరగనున్నాయి. డిసెంబర్ 25 నుంచి జనవరి 30 వరకు ముహూర్తాలు లేక పోవడంతో పెళ్లీలకు బ్రేక్ పడింది. దీంతో శుభ కార్యాలు లేక ఫంక్షన్ హాల్స్, టెంట్ హౌస్‌లు, డెకరేషన్ దుకాణాలు వెలవెలబోయాయి. తిరిగి పెళ్లీలకు శుభ ముహుర్తాలు ఉండటంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో పెళ్లీలతో సందడి వాతావరణం కనిపించనుంది.

జూన్ 7 వరకు జోరుగా పెళ్లిళ్లు

నేటి నుంచి జూన్ 7 వరకు 4 నెలల 15 రోజుల పాటు జోరుగా పెళ్లిళ్లు జరగనున్నాయి. శుక్రవారం తోపాటు ఫిబ్రవరి నెలలో 2, 3, 7, 13, 14, 15, 18, 19, 20, 21, 23, 25 తేదీల్లో మార్చి నెలలో 1, 2, 6, 7, 12 తేదీలు, ఏప్రిల్‌లో 14, 16, 18, 19, 20, 21, 25, 29, 30, మే నెలలో 1, 5, 6, 8, 15, 17, 18 తేదీలు, జూన్‌లో 1, 2, 4, 7 వరకు మంచి ముహుర్తాలు ఉన్నాయి. దీంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో సుమారుగా లక్షా 50 వేలకు పైగా వివాహాలు జరుగనున్నట్లు పండితులు చెబుతున్నారు. సిద్దిపేటలో 55 వేలు, సంగారెడ్డి జిల్లాలో 60 వేలు, మెదక్ జిల్లాలో 35 వేలకు పైగా పెళ్లిళ్లు జరగనున్నట్లు సమాచారం.

మరికొందరికి ఉపాధి

వివాహాలు జరుగుతున్న నేపథ్యంలో కొంత మందికి ఉపాధికి లభించనుంది. పంతుళ్లు, బ్యాండ్ మేళాలు, టెంట్ హౌస్‌లు, డెకరేషన్, ఫొటో, వీడియో గ్రాఫర్లకు డిమాండ్ ఏర్పడింది. ముహుర్తాలను దృష్టిలో పెట్టుకొని చాలా మంది ముందుగానే అడ్వాన్స్ ఇచ్చుకున్నారు. పంతుళ్లు సైతం గ్రామాలు, పట్టణాల్లో ఎక్కువగా పెళ్లీలు పెట్టడంతో ఇతర గ్రామాల్లోని వారి బంధువులను పెళ్లీలు చేయడానికి రప్పించుకుంటున్నారు. ఇక బ్యాండ్ మేళాలు, టెంట్ హౌస్‌లు, డెకరేషన్, ఫొటో, వీడియో గ్రాఫర్లకు సైతం డిమాండ్ ఉండటంతో ఇతర చోట్ల నుంచి తగిన సామగ్రిని, మనుషులను అద్దెకు తెచ్చుకుంటున్నారు.

ఫంక్షన్ హాల్స్‌లకు భలే డిమాండ్

పెళ్లీల సీజన్ ప్రారంభం కావడంతో ఫంక్షన్ హాల్స్‌కు భలే డిమాండ్ నెలకొంది. ఇప్పటికే పెళ్లి ముహూర్తాలు నిర్ణయించుకున్న కుటుంబాలు 2 నెలల ముందుగానే ఫంక్షన్ హాల్స్ బుక్ చేసుకోవడం విశేషం. ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్ 3,500కు పైగా ఉండగా ప్రభుత్వ(టీటీడీ), కమ్యూనిటీ హాల్స్ మరో 5,000కు పైగానే ఉన్నాయి.

400లకు పైగా ముహూర్తాలు



మాఘ అమావాస్య ప్రారంభం కావడంతో శుక్రవారం నుంచి వివాహాలకు ముహూర్తాలు ఉన్నాయి. జూన్ 7 వరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో సుమారు లక్షా 50 వేలకు పైగానే జంటలు ఒకటి కానున్నాయి. నేనే ఇప్పటికే 400లకు పైగా వివాహాలకు ముహూర్తాలు నిర్ణయించాను. 36 రోజుల విరామం తర్వాత 4 నెలలకు పైగా మంచి ముహూర్తాలు ఉండడంతో వేల జంటలు ఒక్కటవుతున్నాయి.

- ఎం.ఎన్ చార్య, ప్రముఖ అంతర్జాతీయ జ్యోతిష్య పండితులు

3 నెలల ముందుగానే బుక్



పెళ్లీలకు ఫంక్షన్ హాల్స్ 3 నెలల ముందుగానే బుక్ అయ్యాయి. జనవరి 31, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగే వివాహాలకు ముందు జాగ్రత్తగా చాలా మంది ఫంక్షన్ హాల్స్ బుక్ చేసుకున్నారు. ఇప్పుడు కూడా ఫంక్షన్ హాల్ కావాలని వస్తుంద్రు. బుక్ అయ్యాయని చెబుతుండడంతో ఎలా అంటూ ఆందోళన చెందుతున్నారు.

- కోమటిరెడ్డి రజనీకాంత్‌రెడ్డి, ఫంక్షన్ హాల్ యజమాని దుబ్బాక

టెంట్ హౌస్‌తో ఉపాధి



పెళ్లిళ్ల సీజన్ కావడంతో ముందుగానే చాలా మంది టెంట్ హౌస్ సామగ్రి బుక్ చేసుకున్నారు. ఉన్న కొద్ది ముహూర్తాల్లో ఎక్కువ ఆర్డర్స్ వస్తున్నాయి. మాకు వీలైనన్ని పట్టుకున్నాం. సుమారు 40 రోజులు ముహూర్తాలు లేకపోవడంతో వివాహాలు, ఇతర శుభ కార్యాలు లేక ఖాళీగానే ఉన్నాం. ఇప్పుడు మళ్లీ పెళ్లి ముహుర్తాలు ఉండడంతో టెంట్ హౌస్‌లకు గిరాకీ ఉంది. దీంతో మాకు ఉపాధి దొరుకుతుంది.

- గన్నె బుచ్చిరెడ్డి, టెంటు హౌస్, నిర్వాహకుడు

బండరాళ్ల కింద నలిగిన బతుకులు

గోవర్ధనగిరిలో ఘోరం

- ఉపాధి పనులు చేస్తుండగా తల్లీకూతుళ్లు మృత్యువాత
- ఐదుగురికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులను పరామర్శించిన డీఆర్‌డీఓ జగదేవ్ ఆర్య



మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు, గుమిగూడిన జనం

అక్కన్నపేట(హుస్నాబాద్): ఉపాధి హామీ పనికి వెళ్లి తల్లీకూతురు మృతి చెందడంతో అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. గ్రామస్తుల కథనం మేరకు.. గోవర్ధనగిరి గ్రామానికి చెందిన కందారపు సారవ్వ (50), భర్త మల్లయ్య దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. చిన్న కుమార్తె మమత (32)కు అదే గ్రామానికి అన్నాజీ యోగేశ్వర చారితో వివాహం జరిగింది. ఈ దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. గ్రామంలోనే తల్లీకూతురు ఉపాధి పనులకు వెళ్తుంటారు. గురువారం ఎప్పటి మాదిరిగానే గ్రామ శివారులోని సంజీవరాయిని గుట్ట వద్ద పనికెళ్లారు. గుట్ట నుంచి మట్టి తవ్వకాలు చేపట్టగా మొత్తం 21 మంది కూలీలు పాల్గొన్నారు. ఇందులో సారవ్వ, మమత కూడా ఉన్నారు. గడ్డపారతో మట్టిని తవ్వుతుండగా పెద్ద పెద్ద బండరాళ్లు ఒక్కసారిగా కూలీల పై పడ్డాయి. ఈ ప్రమాదంలో తల్లి కూతుళ్ల మట్టిపెడ్డలు కింద ఇరుక్కున్నారు. తల్లి సారవ్వ ఊపిరాడక, కూతురు మమత పై బండరాళ్లు పడి అక్కడికక్కడే మృతి చెందారు. మట్టిలో కూరుకుపోయిన మృతదేహాలను జేసీబీ సహాయంతో వెలికితీశారు. వీరితోపాటు ఇంద్రాల స్వరూప కాళ్లపై బండరాళ్లు పడటంతో నుజ్జునుజ్జయ్యింది. అలాగే ఇంద్రాల రేణుక, గౌడ వెంకటయ్య, వలబోజు మణెమ్మ, తాటిపెల్లి విమలకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో హుస్నాబాద్ ఆస్పత్రికి తరలించారు.



క్షతగాత్రులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ జగదేవ్ ఆర్య

పని ప్రదేశంలో పర్యవేక్షణ కరువు

ఉపాధి హామీ పనుల్లో భాగంగా కూలీలు చేస్తున్న పని ప్రదేశంలో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. పనులకు సంబంధించి పని ప్రదేశంతోపాటు కూలీలకు అవసరమయ్యే ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ప్రతీరోజు ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ల పర్యవేక్షణలో పనులు జరగాలి. కూలీలకు అనువుగా ఉన్న ప్రదేశంలో పనులు కల్పించాలి. కానీ గుట్టను తవ్వే ప్రదేశంలో పై భాగంలో పెద్ద పెద్ద బండ రాళ్లు ప్రమాదకరంగా ఉన్నాయి. అవేమి అధికారులు పట్టించుకోకపోవడం, అధికారుల నిర్లక్ష్యంతో రెండు ప్రాణాలు గాలిలో కలిసి పోయాయి.

బాగా చదువుకోండి.. పనికి వెళ్తొస్తా

మమత భర్త యోగేశ్వర చారి వెల్డింగ్ పనులకు వెళ్లాడు. ప్రతి రోజూ మమత ఇద్దరి పిల్లలను పాఠశాలకు పంపి పనులకు వెళ్తుంది. గురువారం పిల్లలను పాఠశాలకు రెడీ చేసి నాలా పనికి వెళ్లకుండా బాగా చదువుకోవాలని చెప్పి ఉపాధి పనికి వెళ్లింది. పిల్లలు చివరి చూపునకు నోచుకోకుండానే తల్లి అనంతలోకాలకు వెళ్లిపోవడంతో వారు రోదించిన తీరు అందరినీ కలిచివేసింది.

ఒక్కసారిగా మట్టిపెడ్డలు పడ్డాయి



అందరం కలిసి పని చేస్తుండగా ఒక్కసారిగా పై నుంచి పెద్ద పెద్ద బండరాళ్లు పడటంతో ఉలిక్కి పడ్డాం. మట్టి తవ్వకాలు దంగడం లేదని పలు మార్లు చెప్పాం. అయినా వినలేదు. సులువుగా ఉండాలని రాత్రి నీళ్లు పట్టామని ఉపాధి హామీ సిబ్బంది చెప్పడంతో పనులకు వచ్చాం. కానీ తల్లీకూతురు పై బండ రాళ్లు పడి మా కళ్లెదుటే మృతి చెందడం చాలా బాధేసింది.

- ప్రత్యక్ష సాక్షులు అనిత, పద్మ

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ సతీష్

ప్రమాద ఘటనా స్థలాన్ని హుస్నాబాద్ ఏసీపీ సతీష్, సీఐ శ్రీనివాస్, ఎస్సైలు విజయ్ భాస్కర్, తోట మహేష్, ఎంపీడీఓ బానోతు జయరాం, ఎంపీఓ గుగులోతు మోహన్ పరిశీలించారు. అనంతరం హుస్నాబాద్ ప్రభుత్వా స్పత్రిలో చికిత్స పొందుతున్న కూలీలను డీఆర్‌డీఓ జగదేవ్ ఆర్య పరామర్శించారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతి చెందిన కూలీలకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని వెల్లడించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ సతీష్

బండి సంజయ్ దిగ్భ్రాంతి

కలెక్టర్‌కు ఫోన్ చేసి ఘటనపై ఆరా..

హుస్నాబాద్: ఉపాధి హామీ పనులు చేస్తుండగా బండరాళ్లు మీద పడి ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలు మృతి చెందడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్తున్న బండి సంజయ్ విషయం తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ మను చౌదరికి ఫోన్ చేశారు. ఘటనకు గల కారణాలపై ఆరా తీశారు. మృతుల కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. ఉపాధి హామీ పనులు చేస్తుండగా మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ.2లక్షల సాయం అందిస్తామన్నారు. దీంతో పాటు మృతులు మహిళ పొదుపు సంఘాల్లో కొనసాగుతున్నందున మరో రూ.10 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అలాగే కుటుంబంలో ఎవరైనా అర్హులుంటే ఔట్ సోర్సింగ్ ఉద్యోగం కూడా ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలు, జరిమానా

సిద్దిపేటఅర్బన్: మూడేళ్ల బాలికను అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి కోర్టు జైలు శిక్షతోపాటు జరిమానా విధించింది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట పట్టణంలోని మైత్రీవనంలో నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న వ్యక్తి మనమరాలిపై గతేడాది ఆగస్టు 19న అదే అపార్ట్‌మెంట్‌లో పెయింటింగ్ పని చేసే ఉత్తరప్రదేశ్‌లోని రసూలాపూర్‌కు చెందిన అజయ్ అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తాత ఫిర్యాదు మేరకు సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జీషీట్ దాఖలు చేశారు. సిద్దిపేట ఫస్ట్ అదనపు డిస్ట్రిక్ట్, సెషన్స్ కోర్టులో గురువారం కేసు విచారణ జరుగగా నేరస్తుడికి 20 ఏళ్ల కఠిన కారాగార జైలు శిక్షతోపాటు రూ.50 వేల జరిమానాను విధిస్తూ డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్, సెషన్స్ జడ్జి సాయిరమాదేవి తీర్పునిచ్చారు. నేరస్తుడికి శిక్ష పడేలా కృషి చేసిన త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, కోర్టు మానిటర్ ఇన్స్‌పెక్టర్ కమలాకర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకట్‌లింగం, కోర్టు కానిస్టేబుళ్లు స్రవంతి, స్వామి, కోర్టు లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ లోకేష్, భరోసా సెంటర్ సిబ్బంది సౌమ్య, హరితలను సీపీ అనురాధ అభినందించారు.

50 టీఎంసీలతో మల్లన్నసాగర్ వద్దన్నాం

- పుస్తకావిష్కరణలో ఎమ్మెల్సీ కోదండరాం

సిద్దిపేటకమాన్: 50 టీఎంసీలతో మల్లన్న సాగర్ అవసరం లేదని చెప్పినా అప్పటి ప్రభుత్వం వినలేదని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం రాత్రి జరిగిన మల్లన్న సాగర్ నిర్వాసితులపై మల్లారెడ్డి రాసిన "గూడు చెదిరిన దృశ్యం" పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోదండరాం మాట్లాడుతూ.. ప్రాజెక్టుల్లో భూములు, ఇళ్లు కోల్పోయి రోడ్డునపడ్డ రైతుల జీవితాలను కళ్లకు కట్టినట్టుగా చూపించారన్నారు. నిర్వాసితుల జీవితాల్లోకి చూస్తే వారు ఎంత దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని తెలిసింది అన్నారు. రచయిత ఇంత చక్కగా పుస్తకం రాయడం గొప్ప విషయమని అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు బలవన్మరణం

ఇద్దరు మహిళలు, ఓ యువకుడు

గజ్వేల్‌రూరల్: చెరువులో దూకి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని సంగుపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సంగుపల్లికి చెందిన లింగనోళ్ల సత్తమ్మ(60) భర్తతో పాటు కుమారులు గతంలో మృతి చెందారు. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు గురైన సత్తమ్మ జీవితంపై విరక్తి చెంది గ్రామ సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్ బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు.

ఉరేసుకొని..

మిరుదొడ్డి(దుబ్బాకల): ఉరేసుకొని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతెలో చోటు చేసుకుంది. గురువారం భూంపల్లి ఎస్‌ఐ హరీశ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన గోత్రాల జ్యోతి (36) రాజు నిరుపేద దంపతులు. కొంత కాలంగా జ్యోతి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. చికిత్స నిమిత్తం అందినకాడికి అప్పులు చేశారు. దీనికి తోడు ఇంట్లో పూట గడవడానికి మరిన్ని అప్పులు చేయాల్సి వచ్చింది. ఒక పక్క అనారోగ్య సమస్య, మరో పక్క ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన జ్యోతి బుధవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి అన్న సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మానసికస్థితి సరిగా లేక..

జిన్నారం (పటాన్‌చెరు): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి కథనం మేరకు.. గుమ్మడిదల మున్సిపాలిటీకి చెందిన బెజుగారి రమేశ్ కుమారుడు నరేశ్ (28) ఎంబీఏ పూర్తి చేశాడు. కిరాణా షాపులో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. నరేశ్‌కు మానసిక స్థితి బాగా లేకపోవడంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించగా మాత్రలు వాడుతున్నాడు. మానసిక స్థితి బాగాలేదని మనస్తాపం చెందిన నరేశ్ గురువారం ఉదయం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమ నిర్మాణం సీజ్



భవనం పరిసరాల్లో టాస్క్‌ఫోర్స్ కమిటీ పరిశీలన

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలో హైదరాబాద్ రోడ్డు బావిష్ఖాన బ్రిడ్జి రెలింగ్ ధ్వంసం చేసి, నిబంధనలు అతిక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న భవనాన్ని బల్దియా అధికారులు గురువారం సీజ్ చేశారు. ఇటీవల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చ జరగడం, అప్పటికే మున్సిపల్ కమిషనర్ సంబంధించిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో గురువారం జిల్లా టాస్క్ ఫోర్స్(డీటీఎఫ్)కమిటీ మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణం గురించి చర్చ జరుగగా, కుంభాల సంతోష్ రెడ్డి అనే వ్యక్తి హైదరాబాద్ రోడ్డు బ్రిడ్జి పక్కన కోమటిచెర్వు కెనాల్ సమీపంలో నియమ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా భవన నిర్మాణం చేపడుతున్నట్టు డీటీఎఫ్ కమిటీ పోలీసుల సహకారంతో క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిర్ధారించారు. మున్సిపల్ చట్టం 2019 సెక్షన్ 181 ప్రకారం భవనాన్ని డీటీఎఫ్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. భవనానికి మున్సిపల్ ఆధ్వర్యంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. నూతనంగా నిర్మాణం చేసే వారు తప్పనిసరి మున్సిపల్ నిబంధనల మేరకు అనుమతి తీసుకోవాలన్నారు.

బల్దియా ఎదుట ఆత్మహత్యాయత్నం



డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న బాధితులు

- ఇంటి ప్రహరీ గోడను కూల్చారని డీజిల్ పోసుకున్న బాధితులు
- అడ్డుకున్న పోలీసులు

సిద్దిపేటజోన్: ఇంటి ప్రహరీ గోడను సమాచారం లేకుండా మున్సిపల్ అధికారులు కూల్చివేశారని, దీని వెనుక స్థానిక వార్డు బీఆర్ఎస్ నేత ఒత్తిడి ఉందని ఆరోపిస్తూ గురువారం బాధితులు మున్సిపల్ కార్యాలయం గేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఒక దశలో ఇంటి కుటుంబ సభ్యులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా సకాలంలో పోలీసులు అడ్డుకున్నారు. బాధితుల కథనం ప్రకారం.. స్థానిక 12 వార్డులో పసునూరి నిర్మల ఇంటి నిర్మాణం చేపట్టారు. నిబంధనలు అతిక్రమించి ఇంటి ప్రహరీ నిర్మించారని గతంలో మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. మళ్లీ నిర్మించుకున్నారు. గురువారం మరోసారి మున్సిపల్ అధికారులు కూల్చివేయడంతో బాధితులు పసునూరి నిర్మల, చంద్రం, శశిధర్, స్వామి, కీర్తన మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకొని ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేపట్టారు. ఒక దశలో బాధితులు ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు అక్కడికి చేరుకొని మద్దతు పలికారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ బాధితులతో చర్చించి వివరాలు సేకరించారు. సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తానని సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. స్థానిక వార్డు బీఆర్ఎస్ నాయకుడు కక్ష్య పూరితంగా ఇంటి ప్రహరీ గోడను కూల్చే ప్రయత్నాలు చేస్తున్నాడని బాధితులు ఆరోపించారు. ఇంటి నిర్మాణం విషయంలో సంబంధించి నాయకుడికి డబ్బులు కూడా ఇచ్చామని, అకారణంగా గోడను కూల్చివేశారని ఆరోపించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతుడి వివరాలను సేకరిస్తున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్

ములుగు(గజ్వేల్): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన ములుగు మండలం క్షీరసాగర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన కుకునూరి శ్రీనివాస్(42)కు 25 గుంటల భూమి ఉండగా వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లాడు. గట్టుపై నడుచుకుంటూ వెళ్తుండగా పక్కనే తేలి ఉన్న విద్యుత్ వైర్ కాలికి తగిలి కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య సరిత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ

సదాశివపేట(సంగారెడ్డి): గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మహిళ మృతి చెందిన ఘటన పట్టణ పరిధిలోని ప్రియదర్శిని కాలనీ వద్ద గురువారం చోటు చేసుకుంది. సీఐ మహేశ్‌గౌడ్ కథనం మేరకు.. ఎదురింటి బాలమ్మ(60) అనే మహిళ ప్రియదర్శిని కాలనీలో నివాసం ఉంటున్న కుమారుడు వెంకటయ్య ఇంటికి నడుచుకుంటూ రోడ్డు దాటతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



రఘు మృతదేహం

వేములవాడఅర్బన్: అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ మూలవాగు పక్కన గల కల్లు కాంపౌండ్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా కేంద్రం రాంనగర్‌కు చెందిన సారుగు రఘు(32) వంటమాస్టర్‌గా పని చేస్తున్నాడు. వ్యక్తి గత గొడవలతో గతేడాది నుంచి భార్య అమూల్య తల్లిగారి ఇంటి వద్ద ఉంటుంది. బుధవారం సాయంత్రం సిద్దిపేటకు చెందిన విక్రాంత్‌తో కలిసి రఘు వేములవాడకు వచ్చాడు. గురువారం ఉదయం కల్లు కాంపౌండ్‌లో మృతదేహమై కనిపించాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని మృతుడి భార్య అమూల్యకు తెలిపారు. మృతదేహంపై గాయాలు ఉండడంతో భర్త మృతిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఘటనా స్థలాన్ని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఎస్సై రమేశ్ పరిశీలించారు.